క్లుప్తంగా

ఉపాధ్యాయుల ఎంపికపై హర్షం



పీఆర్‌టీయూ రాష్ట్ర సంఘంలో ఎన్నికైన ఉపాధ్యాయులతో కృష్ణారెడ్డి తదితరులు

యాలాల: పీఆర్‌టీయూ రాష్ట్ర సంఘంలో యాలాల మండలానికి చెందిన ఉపాధ్యాయులకు చోటు దక్కడంపై సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, రాములు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా మొగులయ్య, దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీధర్‌రెడ్డి, లక్ష్మయ్య, మహిళ విభాగం ఉపాధ్యక్షురాలుగా కిష్టమ్మ, కార్యదర్శులుగా పరమేశ్వరమ్మ, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. రాష్ట్ర సంఘంలో మండలం నుంచి 8 మందికి చోటు దక్కడం పట్ల మండల ఉపాధ్యాయుల తరఫున హర్షం వ్యక్తం చేశారు.

అనాథలకు దుస్తుల పంపిణీ



చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న ప్రతిమారెడ్డి

పరిగి: మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి బుధవారం దసరా పండగ సందర్భంగా పట్టణ కేంద్రంలోని బాలసదనంలోని అనాథ పిల్లలకు దుస్తులను పంపిణీ చేశారు. మొత్తం 55 మంది చిన్నారులకు వివిధ రకాల దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద పిల్లలకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనాథ పిల్లల సమస్యల పరిష్కారానికి ముందుంటామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ మొహరునిస్సా, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షురాలు లక్ష్మి, బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు అనుషా, సూపర్‌వైజర్లు ఇందిరా, యాదమ్మ, నిర్మల పాల్గొన్నారు.

పీహెచ్‌సీల పరిశీలన



రామయ్యగూడ పీహెచ్‌సీని సందర్శించిన ఎంపీడీఓ

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని సిద్దులూర్, రామయ్యగూడ పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)లను బుధవారం ఎంపీడీఓ వినయ్‌కుమార్ సందర్శించారు. ఈ మేరకు ఆయన ఆస్పత్రుల్లో ఉన్న మౌలిక వసతులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని గదులు, టాయిలెట్స్, ఫర్నీచర్ తదితర వాటిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయా చోట్ల ఆస్పత్రి సిబ్బంది ఎంపీడీఓకు సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చీఫ్ విప్‌నకు శుభాకాంక్షలు



మహేందర్‌రెడ్డిని కలిసిన మండల నాయకులు

యాలాల: శాసన మండలి చీఫ్ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన పట్నం మహేందర్‌రెడ్డిని బుధవారం మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. యాలాల మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్ తదితరులు మహేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే గుర్తింపు

కుల్కచర్ల: నైపుణ్యం ఉన్న ఉద్యోగులకు ఎక్కడైనా గుర్తింపు, గౌరవం ఉంటుందని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. బుధవారం కుల్కచర్ల డీసీసీబీ బ్యాంక్‌లో నూతనంగా విధుల్లో చేరిన క్లర్క్ సురేశ్‌కు ఏక కాలంలో మూడు బ్యాంక్‌ల్లో ఉద్యోగాలు వచ్చిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మొగులయ్య మాట్లాడుతూ.. ప్రతిభ గల వ్యక్తులు బ్యాంక్‌లో పనిచేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, డైరెక్టర్ కొండయ్య, సహకార బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




తాండూరు టౌన్: నగరేశ్వరాలయంలో సరస్వతీ దేవి అలంకరణ



ధారూరు: సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో



దుద్యాల్: పూజలందుకుంటున్న దుర్గామాత

వైభవంగా ఊరేగింపు



గజవాహనంపై స్వామివారు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో వెలిసిన శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి స్వామివారిని గజవాహనంపై ఊరేగించారు. ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, అర్చనలు, ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేసి అనంతరం నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శరన్నవరాత్రులు.. నిత్యపూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాలు, మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిరూపాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆయా ప్రాంతాల మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలతో ఆడిపాడారు. పలు గ్రామాల్లో బోనాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



మోమిన్‌పేట: ఉన్నత పాఠశాల ఆవరణలో బతుకమ్మ సంబురాలు



కొడంగల్ : తహసీల్దార్ కార్యాలయం ఎదుట వేడుకలు



అనంతగిరి: గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



కుల్కచర్ల: చౌడాపూర్‌లో..



దుద్యాల్: బోనాల ఊరేగింపు



పరిగి: బీసీ కాలనీలో బతుకమ్మ సంబురాల్లో కౌన్సిలర్ అనసూయకృష్ణ



తాండూరు: ఆర్టీసీ డిపోలో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు



అనంతగిరి: వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణంలో పాల్గొన్న దంపతులు



ధారూరు: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పూడూరు: చింతలపల్లిలో నవరాత్రి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



అనంతగిరి: శ్రీవారిని దర్శించుకుంటున్న చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అనంతగిరి: వికారాబాద్ మండలానికి చెందిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ లబ్ధిదారులకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమది పేదల ప్రభుత్వమని, సంక్షేమానికి మారుపేరన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జాఫర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

నిర్వహణ లోపం.. బస్‌షెల్టర్‌కు శాపం



జిన్నారం గేటు వద్ద బస్ షెల్టర్ దుస్థితి

నిర్వహణ లోపంతో ఆర్టీసీ బస్ షెల్టర్లు దయనీయంగా తయారయ్యాయి. అయినా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కోట్‌పల్లి మండలంలోని ఎన్కెపల్లి, జిన్నారం బస్‌షెల్టర్లు పశువులకు ఆశ్రయంగా మారాయి. వర్షం వస్తే చాలు అక్కడే మేకల మందలు ఉంచుతున్నారు. దీంతో అపరిశుభ్రంగా మారడంతో ప్రయాణికులు ఎవరూ కూర్చోవడం లేదు. మోత్కుపల్లి గేటు, బార్వాద్ తండా, ఓగులాపూర్, నాగసాన్‌పల్లి, ఎన్నారం, బంట్వారం మండలంలోని యాచారం గేటు వద్ద బస్‌షెల్టర్లు ఉన్నాయి. వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

– బంట్వారం

ప్రజా సంఘాల మద్దతు ముఖ్యం



ప్రజా సంఘాల నాయకులతో గోపి

రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి

కొడంగల్ రూరల్: రజకుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి అన్నారు. బుధవారం పట్టణంలో వివిధ ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, బడుగుల రాజకీయ భవిష్యత్ తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజా సంఘాల నాయకుల మద్దతు కూడగడుతూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అంబేడ్కర్ ప్రజాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగల కొండల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాలే సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, రజక రిజర్వేషన్ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.అశోక్, అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్‌బాబు, డీవీఎంసీ సభ్యుడు దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పథ సంచలన్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో గురువారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పథ సంచలన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే స్వయం సేవకులు సాయంత్రం గంటలలోపు పాత శిశు మందిరం వద్దకు చేరుకోవాలన్నారు. పథ సంచలన్ అనంతరం జెడ్పీ బాలుర హైస్కూల్ మైదానంలో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సేవా భారతి తెలంగాణ సంయోజక్ వాసు పాల్గొంటారన్నారు. హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ను ప్రారంభించి వందేళ్లు అవుతున్న సందర్భంగా దసరా ఉత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు శాఖ ప్రతినిధులు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను హెడ్గేవార్ స్థాపించి శతాబ్దం అవుతుందన్నారు. దీన్ని పురస్కరించుకొని మోమిన్‌పేటలో శుక్రవారం మధ్యాహ్నం సంగమేశ్వరాలయం నుంచి మాణిక్ ప్రభు మందిరం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ప్రతి హిందువు సకాలంలో చేరుకొని ర్యాలీలో పాల్గొనాలని వారు కోరారు.

తిరుమలలో కళా ప్రదర్శనలు



శ్రీవారి ఊరేగింపులో గుస్సాడీ బృందం

బొంరాస్‌పేట: కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వరుడి సన్నిధిలో ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ కళారూపాలు అబ్బుర పరిచాయి. బుధవారం జిల్లా కళాకారులు జానపద కళారూపాలు ప్రదర్శనలిస్తున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన ఘట్టం గరుడ వాహనంతోపాటు కల్ప వృక్ష వాహనం, సర్వభూపాల వాహనంపై ఊరేగిన శ్రీవారి ముందు గుస్సాడీ, కోయ, ధింసా, బంజారా కళా ప్రదర్శనలిచ్చారు.

ఉద్యమకారుల ఫోరం కన్వీనర్‌గా మహేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్‌గా యాలాల మహేశ్వర్‌రెడ్డిని ఎంపిక చేశారు. బుధవారం నగరంలోని ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండో సారి యాలాల మహేశ్వర్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో పనిచేసిన ఉద్యమకారులను గుర్తించాలన్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం



నారాయణరావు దంపతులకు రసీదు ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కొడంగల్: పట్టణ శివారులో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి కొడంగల్‌కు చెందిన ఊట్కూరు నారాయణరావు దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. బీజాపూర్–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన అయ్యప్ప స్వామి ఆలయం నిర్మిస్తున్నారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం సాగుతోంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్రయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఉమాపతి గౌడ్, నర్సిరెడ్డి నిర్మాణానికి సహకరించాలని కోరారు.

పండగ పూట ఇబ్బందులుండొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: గ్రామాల్లో పండగ వేళ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మలను చెరువులలో విడిచే సమయంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్యం, వీధిదీపాలు, తాగు నీటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. పండగల వేళ ప్రజలు ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు.

కాన్షీరాం ఆశయ సాధనకు కృషి



కొడంగల్ రూరల్: కాన్షీరాం వర్ధంతిలో అంబేడ్కర్ సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: బడుగు, బలహీనవర్గాల జీవితాల్లో రాజకీయ చైతన్యం నింపిన మహనీయుడు మాన్యశ్రీ కాన్షీరాం అని అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యూ.రమేశ్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ.. కాన్షీరాం ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, వెంకటయ్య, కె.సాయిలు, శ్రీనివాస్, ఎ.సాయిలు, చిన్నయ్య, అంజిలప్ప, అశోక్, వెంకట్‌సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

అనంతగిరి: వికారాబాద్‌లోని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం కాన్షీరాం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాన్షీరాం దేశానికి, బహుజన సమాజాభివృద్ధికి చేసిన సేవలను నాయకులు గుర్తు చేసుకున్నారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కన్వీనర్ రవీందర్, శ్రీనివాస్, వెంకటేష్, సత్యం, రాజు, అశోక్, మల్లేష్, కరీం పాల్గొన్నారు.

కార్మికుల సంపూర్ణ ఆరోగ్యానికి పరీక్షలు



మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్ విష్ణువర్ధన్

దుద్యాల్: కార్మికులు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని సీఎస్‌సీ హెల్త్‌కేర్ సెంటర్ జిల్లా కో ఆర్డినేటర్ విష్ణువర్ధన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికులకు(బీమా కార్డుదారులు) వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పనులు చేయడానికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముందస్తుగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి జిల్లా కేంద్రం నుంచి ఆనంద్, లత వచ్చారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, మాజీ సర్పంచ్ ఖాజా, వేణుగోపాల్ గ్రామస్తులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.